మరొకరి భార్యగా ఎదురైన ప్రియురాలు అతనికి నేర్పిన గుణపాఠం?

ఎస్.భవాని కథ

# ప్రేమాతిథి

"తరలిరాద తనే వసంతం, తన దరికి రాని వనాలకోసం" మనసు తియ్యగా మూలిగింది. చేతిలోని ఉత్తరాన్ని చూసి. ఔను! నా వసంత నా మనోవనాన్ని ప్రఫుల్లీకరించటానికి మరో మూడురోజుల్లో రాబోతోంది.

హృది గదిలో మ్రోగే మువ్వల ఝరి, ఏనాడో తునకలైన నా ప్రణయసౌధాన్ని తిరిగి స్థాపించలేని అశక్తతో కూడిన నిస్సారతను ఈనాడు తిరిగి చిన్న చిన్నగా చిగురులేస్తున్న ఆశలరేకులు నిర్మిస్తున్న పునాదులను చూసి మరింత ఆనందంగా పులకరిస్తున్న వేళ.

"ఏవండీ! ఇవ్వాళైనా కనుక్కోండీ ఆ డాక్టరమ్మను కాస్త నా విషయం"

నా ప్రేమరాగాలను భయంకరంగా ఛేదిస్తూ వినిపించిన శ్రీమతి గొంతుక వసంతారాధనతో నిండిపోయిన నా మనసుకు, అపశృతి తారాస్థాయికి చేరుకున్నట్లు అన్పించింది.

రాక రాక వస్తున్న వసంతతో ఇన్నేళ్ల తర్వాత మనసు విప్పి మాట్లాడుకునే భాగ్యం కూడా కలగదేమో ఈవిడగారు ఇక్కడే వుంటే... ఒక పెద్ద కోటగోడలా....

ఎలా... ఎలాగబ్బా వసంత వస్తే ముఖ కవళికలు మార్చుకుని ప్రవర్తించగలగడం? ఉహూ! తను ఉండలేదు! రక్తంతో అభిషేకించడానికి కూడా సిద్ధపడి వసంతను ప్రేమించిన తను, పరాయి మగాడిలా... ప్రవర్తించగలడా...

నవ్వితే మూసుకుపోయే ఆ కళ్లలో



"తళుక్" మని మెరిసే కాంతులు, ఏం మాట్లాడినా తన పేరే పిలిచినట్లు మెలితిరిగే పెదవులు... ఆమె అణువణువు తనదిగా భావించి పూజించిన వసంత తనకెదురుగా కూర్చుంటే... శ్రీమతికి భయపడి... ఇద్దరం ఓరగా దోరగా చూసుకుంటు ఒకళ్లనొకళ్లు... కనీసం... అలా... వేళ్ళయినా... తాకించుకోకుండా... ఉహూ! బాలేదు...

అసలు వసంత వచ్చేదే తనకోసం... పనికట్టు కుని.. అలాంటప్పుడు.. ఎలా మేనేజ్ చేయడం?

''పిల్లలు కూడా అమ్మామ్మవాళ్లింట్లో వు న్నారు. ఇప్పుడు చేయించకపోతే మళ్లీ వీలవదు'' మళ్లీ అంది పెద్దగా, కొంచెం కోపంగా!

ఆలోచిస్తున్నాను... తీవ్రంగా... వంట కు చెయ్యి కాల్చుకోవాల్సిందేనా... తప్పదా! దొరికింది! మెరుపులాంటి ఆలోచన. భోజ నానికి హోటల్లో అడ్జస్ట్ అయిపోవడమే. శ్రీమతి ఎప్పటినుండో కోరుతున్న కోరిక ను ఈనాడు తను తీర్చబోతున్నాడు. ఆమె ''హి(స్టక్టమీ'' రేపే! వారంరోజులు దూరం గా వుండవచ్చు.

* * * *

సినిమా హాళ్ల బాత్‌రూంలో పది నిమిషాలు నిలబడమన్నా నిలబడచ్చుకానీ మనకిష్టమైన వాళ్ల రాకకోసం ''ఎదురుచూ డటం'' అంత శిక్ష మరొకటి లేదేమో!

బహుశ ఈ పాటికి వాళ్ల మామయ్య వాళ్ళింటికి చేరే వుంటుందేమో! ఛ! కనీసం స్టేషనుకు వెళ్లే ఛాన్సు కూడా దక్కనీయలే దు ఆమె బంధువులు. బహుశ సాయంత్రం బయలుదేరుతుందేమో తన ఇంటికి. ఫోన్ నంబరు కూడా వుందే తన దగ్గర. వచ్చిన వెంటనే ఫోన్ చేయచ్చుకదా!

(ట్రింగ్... (ట్రింగ్... ఒక్క వుదుటున దూకినట్లుగా రిసీవర్ అందుకున్నాను. ''ఏ వండీ! నేను సత్యని! ఆపరేషను సాయంత్రం ఆరింటికిట. వస్తారా?'' కోపంతో పళ్లు పటపట కొరికాను శ్రీమతిని గొంతు పిసికి చంపేయాలన్నంత కసితో.

''వస్తాలే'' ఎన్నడూ లేనంత కటువుగా వినిపించింది నా స్వరం నాకే. పెట్టేసాను. నిరీక్షణ నిష్ఫలితం అవుతుందేమోనన్న బాధ తోకూడిన అసహాయతతో.

''(ట్రింగ్... (ట్రింగ్''

మళ్లీ అదే ఆతృతతో అందుకున్నాను. చేతులు చిన్నగా అదురుతున్నాయి. ''హలో'' కమ్మని గొంతు. వసంతదే! ఒక్కసారిగా ఆమె ఒడిలో వెళ్లి వాలిపోవాలన్పించేంత ఆప్యాయత నన్ను ముంచెత్తిన అనుభూతి. ఉక్కిరి బిక్కిరైన భావనలతో ఊపిరి ఆడటం మానేసిందేమో అన్పించింది.

''హలో...హలో'' మళ్లీ కొంచెం గట్టిగా అంది.

''హలో'' ఠకీమని జవాబిచ్చాను పిలిచి పిలిచి అలసిపోతుందేమోనన్న అప్రమత్తత తో.

''రవీ! నేను వచ్చి అరగంట అయింది. ''పెళ్ళి'' మధ్యాహ్నం ఒంటి గంటకు. అది అటెండ్ అయ్యాక డైరెక్టుగా మూడు మూడున్నరకల్లా మీ ఇంటికి వస్తాను గుర్తులు తెలుసులే! ఇంట్లోనే వుంటావా?'' ఎదురు చూసి ఎదురుచూసి అలసిపోయిన నాకు కలో నిజమో అర్థం కాని ఆనందం గొంతుకు అడ్డుపడి మూగవాడ్ని చేసేస్తుం టే అతి (ప్రయత్నంతో ''అలాగే'' అన్నాను. ఫోన్ పెట్టేసిన చప్పుడు. తెలియకుండానే నా ముఖంలో పులకరింతల తాలూకు వేడి, వెచ్చని నిట్టూర్పులను విడుస్తుంటే బైక్

చూసాను. పదకొండు! ఇంకా నాలుగు గంటలు... బ్రతకలేక బ్రతకాలి.

వీడియో ఆన్ చేసి "సీతాకోకచిలుక" సినిమా క్యాసెట్ పెట్టాను. మేము ప్రేమించుకున్న తొలిరోజుల్లో రిలీజయి మమ్మల్ని మరింత దగ్గరా చేసిన సినిమా! ఇలా ఇష్టమైన సమయాల్లో ఒంటరిగా పెట్టుకుని చూస్తు వుంటాను.

సినిమా అయిపోయింది. ఇంకా ఒకటిన్నర గంట! మరో క్యాసెట్ తీసి పెట్టాను. ఆ ఒకటిన్నర గంట ఎలా గడిపానో ఆ దేముడికే తెలియాలి. గట్టిగా కళ్లు మూసుకున్నాను నిద్రపోవాలనే అత్యాశతో.

బైట ఆటో ఆగిన చప్పుడు నా గుండె లయ తప్పింది. కాళ్ళలో సత్తువ పోయి లేవడానికే అశక్తుడనయ్యాను. కాలింగ్ బెల్ మ్రోగింది. ఎక్కడలేని చమట పాదాలను జార్చేస్తుంటే లేచి తలుపు తీసాను. నవ్వుతూ వసంత!


ఆమె చేయిని అందుకోవాలనే ఆత్రుతతో ముందుకు సాగిన నా చేయి అప్రయత్నంగా ఆగిపోయింది. ఆమె చేతిలోని బాబుని చూడగానే. అవును! శ్రీమతి వసంత కదూ! ఇప్పుడు! పెళ్ళయిన ఒకటిన్నర సంవత్సరానికే... బాబు!

"ఏంటి రవీ! లోపలకు రానీయవా ఏంటి?" నవ్వుతూ లోపలికొచ్చేసింది.

"అసలు రేపు వద్దామనుకున్నాను, తీరిగ్గా మాట్లాడచ్చు కదాని. కానీ మా మామయ్యవాళ్ల పెళ్లిలో బిజీగా వుండటంతో ఏమీ తోచక ఇప్పుడే వచ్చాను" సోఫాలో కూర్చుంటూ అంది.

కలుక్కుమంది నా మనసు. అంటే... అంటే... నన్ను చూడాలనే తాపత్రయంతో రాలేదా? తోచక... తోచక వచ్చావా... నన్ను... నీ రవిని చూడటానికి. రెండు నిముషాలవరకు సర్దుకోలేకపోయాను ఆమె మాటలకు.

"రవీ! బెడ్‌రూం ఎక్కడో చూపిస్తావా? వీడు ఆకలికి ఏడుస్తున్నాడు"




## పెన్షన్ వ్యధ

రిటైర్ అవగానే అందరూ ఎదురు చూసేది పెన్షన్‌కోసం! కొన్ని ఆఫీస్‌లలో రిటైర్ అయిన రోజున అన్ని రకాల బెనిఫిట్స్ అందచేస్తారు. కొన్ని ఆఫీసులలో అయితే రిటైర్ అయి మూడేళ్ళయినా... పెన్షన్ దొరకక ఆఫీస్ చుట్టూ తిరుగుతూ ఉంటారు. కోయంబత్తూరు జిల్లా పోలాచి అనే గ్రామంలో పోస్టల్ క్లర్క్‌గా వెంకటరమణ అయ్యంగారు 1933లో రిటైర్ అయ్యారు.

ఆయన పెన్షన్ బెనిఫిట్స్ 57 సంవత్సరాల తర్వాత ఈ సంవత్సరం అందాయట! వాళ్ళబ్బాయి పట్టువదలని విక్రమార్కుడిలా ఆఫీసులచుట్టూ తిరగటంతో ఇప్పటికయినా లభించింది. కంగ్రాట్స్ అయ్యంగారు.

—జూపిటర్

బాబుని రెండు చేతులమీదగా ఎత్తుకుని లేస్తూ అంది.

అర్థం అయింది! చిన్నగా నవ్వుతూ "లోపలకిరా" అని దారి తీసాను. మంచం మీద పద్మాసనం వేసుకుని "నువ్వు కొంచెం. .. బయటకు'" నానుస్తూ అంది.

గుండెలో ఏదో సన్నగా మంట రాజుకున్న భావన. ఒకసారి... సరిగ్గా పదేళ్ల క్రితం ఇంటర్మీడియట్ పరీక్ష పోయిందని తను ఏడుస్తున్న సమయంలో ఆ బాబు స్థానంలో తనను... పడుకోబెట్టుకుని... లాలించింది.. కానీ... ఇప్పుడు... సిగ్గు! హు! ఒకప్పుడు తను క్షణం కనపడకపోయినా తల్లడిల్లిపోతాన ని గారాలు పోయిన వసంతకు ఈరోజు... తను 'ఒక "పరాయి మగాడు!" ఎంత మారిపోయింది!

"ఏం రవీ! మీ ఆవిడ ఊర్లో లేదా!" జాకెట్టు బటన్లు పెట్టుకుంటూ బాబును చంకన వేసుకుని బయటకు వచ్చింది. మౌనంగా వూరుకున్నాను, గిల్టీతో చచ్చిపోతూ.

"ఔను రవీ! మర్చేపోయా! ఒకసారి బట్టల మార్కెట్టుకు తీసుకెళ్ళగలవా?" ఎందుకు అన్నట్లు చూసాను కళ్ళెత్తి. తిరిగి అదే ఆరాధన మొదలౌతోంది.

"వెళ్లాక చెప్తాన్లే!" చిన్నగా సిగ్గుపడుతూ అంది.

నా మీద... అయితే... ప్రేమ తగ్గలేదా! ఏంటో! ఇందాకటి ఆమె ప్రవర్తనను ఎంత సంకుచితంగా ఆలోచించాడు. అందుకే అంటారు "మగబుద్ధి".

తన వైవాహిక జీవితం, అనుభవాలు, కష్టసుఖాలు అన్నీ చెప్పడం ప్రారంభించింది. వింటున్నంత సేపు నటించినా నేను ఆమెనే చూస్తున్నానన్న భావం ఆమెకు కలగలేదు.

పెళ్లికాక ముందు నాకు విశ్రాంతి గృహాలైన ఆమె ఎద పొంగులు, ఆనందం పట్టలేక పిచ్చిగా నలిపిన ఆ రెండు పిడికెళ్ల నడుము, కలుసుకోగానే "హలో" అని చెప్పకుండానే నా ముద్దుతో కందిపోయే ఆ బుగ్గలు... ఇవన్నీ ఇప్పుడు.... ఆ వెధవ... వసంత మొగుడిపరమా?

ఐనా తన పిచ్చికానీ... వాడి పరం కాకపోతే ఈ బాబుగాడు ఎలా పుడతాడేంటి?

ఛి! ఛి! తనేంటి ఇంత అసహ్యంగా ఆలోచిస్తున్నాడు ఒక ఆడపిల్ల గురించి... ఎంత భార్య కాకపోతే మటుకూ!

"మరి మార్కెట్‌కు వెళ్దామా" ఉలిక్కిపడి లేచాను. ఆమె పిలుపుతో ఇంటికి తాళం వేస్తు "కొంచెం ఒళ్లు చేసావు సుమా!" అన్నాను రసికతతో. "మావారు

కూడా గొడవ పెట్టేస్తున్నారు గ్లామరు తగ్గిపోతుందని". ఆమె నవ్వుతూ అన్నా ఒక పెద్ద బల్లెం తీసి గుండెలోకి కచ్చిగా గుచ్చిన భావన.

"సైట్ కొంటానని మాట ఇచ్చాను రవీ మావారికి. ఒక పోటీలో ఓడిపోయాను. మరి చేసుకున్న బెట్ తీర్చాలి కదా" అంటే... వీళ్లు బెట్స్ పెట్టుకుని కూడా ఆడుకుంటారన్నమాట. తనే.... ఓ పిచ్చివాడిలా... తన భార్యనో ఇబ్బందిగా భావించి జీవితాన్ని నరకం చేసుకుంటున్నాడేమో! మరి "ప్రేమ" లోని పవిత్రతకు తను చూపించే సిన్సియారిటీ? "ఈ "సైట్"

ఎలా వుంది రవీ!''

''బానే వుంది'' ముభావంగా అన్నాను. ''వాది'' అనుకున్న ఆమె ప్రేమంతా వాళ్ళకు పంచేస్తుంటే మామూలుగా ఎలా ఉండగలను!

''అయ్యో! మర్చేపోయాను! మా బాబుకు బాబా సూటు కొనాలి. వచ్చేనెల వాడి పుట్టినరోజు'' ఎంత సెల్ఫిష్ అయిపోయావు వసంతా! మనసులో నీరసంగా మూలిగాను. షాప్‌లోంచి బయటకు నడిచాము.

ఎదురునుంచి పూల బుట్ట పట్టుకుని షాప్ మెట్లెక్కుతున్న ఓ చిన్నపిల్ల ''పూలు కావాలండీ'' ముద్దుగా అడిగింది. పక్కనే ప్రియురాలు. ఎలా కొనకుండా వుండగలను!


''నాకేమో మల్లెపూలు ఇష్టం రవీ! కానీ మావారు అస్సలు విన్పించుకోరమకో! సన్న జాజులంటే మహా మోజట. పెళ్ళికాకముందు ఆయన గర్ల్‌ఫ్రెండ్‌కు అవి ఇష్టమని కొనేవారట. ఎప్పుడు అవే తెస్తారు'' జడలో మల్లెలు ముడుచుకుంటూ నవ్వుతూ అంది.

విస్తుపోయాను. "మరి ఆయనకు గర్ల్‌ఫ్రెండ్ వుందని తెలిసి నీవేమీ ఫీల్ అవ్వవా'' క్యూరియస్‌గా అడిగాను.

''భలేవాడివే! ఎప్పుడో జరిగిన విషయాలు గురించి ఫ్యూచర్ నాశనం చేసుకుంటామా! ఏం నేనేమీ తక్కువ తిన్లేదే. ఒకప్పుడు నీతో వెలగబెట్టానుగా వ్యవహారం. అందుకే క్షమించేసి ప్రేమించేస్తున్నాను ఆయనగారిని' ' ఎవరో నెత్తిమీద గట్టిగా, అతిబలంగా పగిలిపోయేలా కొట్టిన అనుభూతి.

"అయ్యో, అప్పుడే ఏడయిపోయింది. ఇంక వెళ్లాలి సుమా! మళ్లీ ఇంట్లో కంగారు పడతారు.'' అప్పుడే... కనీసం ఒక్కసారి

ఒక్కసారైనా అలా దగ్గరగా నిలబడి దగ్గరకు తీసుకోవాలన్పించట్లేదా నీకు? కనీసం... నా



అతి సున్నిత మనస్తత్వాన్ని బాగా ఎరిగిన నీ మనస్తత్వానికి ఓదార్పు నీవేనని నీకన్పించడం లేదా? అది తప్పు... అని నీవనుకుంటే... నిన్ను ఆడదానిగా గుర్తించిన నా మనస్తత్వం.. పిచ్చిది!

"ఆ ఆ... ఆపాపు! ఆ ఇల్లే!" తన గమ్యం చేరగానే అరిచిన వసంత అరుపుకు సడన్‌గా బ్రేక్ వేసాను. క్షణం ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"రవీ" ఉలిక్కిపడి చూసాను ఆమె వైపు. ప్రపంచంలోని "మార్దవం" అంతా కలగలిపి ఆ రెండు అక్షరాల్లో ఇమిడి ఆమె పెదవులమీదగా ప్రవహించినంత ఆత్మీయత

ఆమె నా కళ్ళలోకి చూస్తోంది మూగగా, సరిగ్గా పదేళ్ళ క్రితం చూస్తున్నట్టు.

"మగవాడు వాడి మగతనం నిలబెట్టుకునేవరకే మగాడు." కానీ ఆడది చివరి శ్వాసవరకు ఆడదే! కారు డోర్ తీసి ఎడంకాలు బయటపెడుతూ అంది.


అర్థంకానట్టు చూసాను. అయోమయంగా అన్పించింది, ఆమె మాటలు.

"ఓ.కే రవీ! బై! వెళ్ళిం తర్వాత ఉత్తరం వ్రాస్తాను. ఆ! రవీ! అంకుల్‌కి టాటా చెప్పు" బాబు చేతిని ఊపుతూ అంది.

అవాక్కయ్యాను! అంటే... బాబు పేరు "రవి" అని పెట్టింది అంటే... అర్థం అయింది వసంతా! ఓడిపోయాను... నీ చేతిలో... చిత్తుగా! ఎంత హీనంగా ఆలోచించాను నీ గురించి... నీ సిన్సియారిటీ "టు యువర్ హస్బెండ్" మైగాడ్!... ఆడదాని మనసు ఇంత... ఉన్నతమైందని... లీలగా.. తిలక్ మాటలు ఎవరో చెవిలో చెప్తున్నట్లు... శూన్యంలో... నవ్వుతున్నట్లు..

"ఆకాశపు వొంపులోన ఆర్ద్రవెనుక నీ నవ్వు
పాతాళం లోతులలో ప్రతిధ్వనించి సాగింది
అంధకారపు సముద్రానికి అవతలి ఒడ్డున నీ రూపం
అందుకోలేని నా చూపుకు ఆశ ఆశగా సోకింది"

*



డిజైన్: కె.కృష్ణకుమారి (ఖమ్మం)